# కలుషిత ఆహారమే ప్రజారోగ్య సమస్యలకు కారణం !

## (07 జూన్ "ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవం" సందర్భంగా)

సురక్షిత ఆహారానికి కేంద్ర బిందువు వైజ్ఞానికశాస్త్రమే. సైన్స్ ద్వారానే కలుషిత ఆహారాన్ని గుర్తించడంతో పాటు దానికి సంబంధించిన వ్యాధులను నివారించడం జరుగుతోంది. ప్రమాదకర బ్యాక్టీరియా, వైరస్, పరాన్నజీవులు, విష రసాయనాలతో కలుషితమైన లేదా అసురక్షితమైన ఆహారం తినడం వల్ల ప్రతి ఏట 600 మిలియన్ల ప్రజలు దాదాపు 200 రకాల రోగాల బారిన పడడం కొనసాగుతున్నది. సురక్షిత ఆహారం ప్రాణాలను కాపాడుతుంది, జబ్బులను నివారిస్తుంది. అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో తీవ్ర ఆహార కొరత వేధిస్తున్న వేళ, కలుషిత ఆహారం ఆ పేదల పాలిట శాపంగా మారుతున్నది. సురక్షిత ఆహారం అందించడం వల్ల ప్రతి ఏట 4.2 లక్షల మందిని, అందులో 40 శాతం వరకు పిల్లల నిండు ప్రాణాలను కాపాడవచ్చుని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

**సురక్షిత ఆహారానికి వైజ్ఞానికశాస్త్రమే పునాది :**

సురక్షిత, కాలుష్య రహిత ఆహార పదార్థాల ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస – ప్రపంచ ఆరోగ్య సంస్థ – ఆహార వ్యవసాయ సంస్థలు సంయుక్తంగా ప్రతి ఏట 07 జూన్ రోజున "ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవం (వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ సురక్షిత ఆహార దినం ఇతివృత్తంగా "సురక్షిత ఆహారం – సైన్స్‌తోనే భద్రత (ఫుడ్ సేఫ్టీ – సైన్స్ ఇన్ ఆక్షన్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. కలుషిత ఆహార సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన, అసురక్షిత ఆహారం ద్వారా అనారోగ్యాలు, ఆహార భద్రత పట్ల పలు సంస్థల ఏకీకరణ, కలుషిత ఆహార మూలాలను తెలుసుకొని నిరోధించడం, సురక్షిత ఆహారానికి మార్గాలను వివరించడం లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా వివరించడం జరుగుతుంది. కలుషిత ఆహారాన్ని గుర్తించి నివారించడం, కలుషిత ఆహార కారణ రోగాలను నియంత్రించడంతో మానవ ఆరోగ్యం సంరక్షించబడుతుంది. ఆహార పదార్థాలు కలుషితం కావడానికి మూలాలుగా వ్యవసాయ క్షేత్రాలు, మార్కెటింగ్ మార్గాలు, పర్యాటకం, ఆహార రవాణా, నిల్వ చేయడం, పంపిణీ, వంట పద్ధతులు, శుభ్రత పాటించకపోవడం, అపరిశుభ్ర నీటి వినియోగం, సరిగ్గా ఉడికించకపోవడం, తినే సమయాల్లో చేతులను శుభ్రం చేసుకోకపోవడం లాంటి ప్రధాన అంశాలు గుర్తించబడ్డాయి.

**కలుషితమైనది అసలు ఆహారమే కాదు :**

సురక్షిత ఆహారం కుటుంబ ఆరోగ్యానికి మూలం. అసురక్షితమైనది ఆహారమే కాదని, అది ఒక విషంతో సమానమని తెలుసుకోవాలి. అసురక్షిత ఆహారం రోగాలను, పేదరికాన్ని పెంచి పోషిస్తున్నది. ముఖ్యంగా యుద్ధాలు, సంక్షోభ ప్రదేశాల్లో అన్ని వయస్సుల అభాగ్యులు/వలసదారులు అసురక్షిత ఆహార విషవలయంలో చిక్కి విలవిల్లాడుతున్నారు. ఈ గంభీరమైన సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వాలు, ఆహారాన్ని పండించే రైతులు, వ్యాపారులు, విద్యావంతులు, విద్యాలయ యువత, వినియోగదారులు, పంపిణీదారులు ఏకమై పోషకాహార నాణ్యతను కాపాడడానికి తగు చర్యలు తీసుకోవాలి. సురక్షిత, పోషక, చవకైన, నమ్మకమైన ఆహారాన్ని పొందడం ప్రతి పౌరుని కనీస మానవ హక్కు అని గుర్తుంచుకోవాలి. సురక్షిత నాణ్యమైన పోషకాహారానికి మూల సూత్రాలుగా శుభ్రత, సరిగ్గా వండడం, సురక్షిత నీటి వినియోగం, ఆహార పదార్థాల శుద్ధి, సరైన ఉష్ణోగ్రతల్లో నిల్వ ఉంచడం లాంటివి పేర్కొనబడ్డాయి.

వైజ్ఞానికశాస్త్రంలోని మైక్రోబయాలజీ, ఫుడ్ టెక్నాలజీ, వాతావరణ వైజ్ఞానిక శాస్త్రం, సామాజిక వైజ్ఞానిక శాస్త్రం, సామాజిక శాస్త్రాల సమన్వయంతో ఆహార నాణ్యత, పోషక విలువలను కాపాడడానికి కృషి జరగాలి. ప్రతి ఒక్కరు తమ దినచర్యలో సురక్షిత ఆహారానికి తగు ప్రాధాన్యం ఇవ్వడం, చిన్న చిన్న చర్యలతో పెద్ద పెద్ద రోగాలకు అడ్డుకట్ట వేయడం జరగాలి. మన ఆరోగ్యం, మనం తీసుకునే ఆహార నాణ్యత పైననే ప్రధానంగా ఆధారపడి ఉంటుందని తెలుసుకోవాలి. మన ఆరోగ్యం, మన చేతుల్లోనే, చేతల్లోనే ఉంటుంది. ఎంత తింటున్నామన్నది ముఖ్యం కాదని, ఏం తింటున్నామన్నదే ప్రధానమని తెలుసుకుందాం. తినే రెండు ముద్దలు సుచిగా, రుచిగా, శుభ్రంగా, సురక్షితంగా ఉండే విధంగా జాగ్రత్త పడదాం. ఆహారాన్ని విషతుల్యం చేయకుండా వివిధ దశల్లో తగిన చర్యలు తీసుకుందాం. "మన సురక్షిత ఆహారమే మన సంపూర్ణ ఆరోగ్యం" అంటూ నినదిద్దాం.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ లక్ష్యం : మంత్రి నారా లోకేశ్

## ఇక ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహణ.. టీచర్ పోస్టుల భర్తీ



అమరావతి, జూన్ 6: ఏపీ విద్యా రంగంలో మరో కీలక ముందడుగు పడింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, ఉన్నత విద్య, వయోజన విద్య, సమగ్ర శిక్షాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏపీ చరిత్రలోనే తొలిసారిగా 16,347 టీచర్ పోస్టులతో చేపట్టిన మెగా డీఎస్సీపై సమీక్ష జరిగింది. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఏడేళ్ల విరామం తర్వాత ఈ మెగా డీఎస్సీ విజయవంతంగా నిర్వహించడం గర్వకారణం. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డీఎస్సీ పరీక్ష ప్రక్రియను ప్రారంభించిన అధికారులకు అభినందనలు. ఇది ఏపీ విద్యా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం" అని తెలిపారు. ఇకపై ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. టీచింగ్ వ్యవస్థలో పారదర్శకత కోసం బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలను కూడా పకడ్బందీగా ప్రారంభించామని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు నాలుగు వేల మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినట్లు వెల్లడించారు. అక్షరాస్యత వృద్ధి కోసం ప్రాజెక్ట్ అ–ఆ (అక్షర ఆంధ్ర)ను మొదలుపెట్టినట్టు చెప్పారు. 100 శాతం అక్షరాస్యత లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. "రాబోయే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను మోడల్ ఎడ్యుకేషన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మా ముఖ్య లక్ష్యం" అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

# శ్రీ సత్యసాయి జిల్లాలో కేంద్ర ఆర్థిక మంత్రి పర్యటన

అమరావతి, జూన్ 6:కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సత్యసాయి జిల్లాలో పర్యటిస్తున్నారు.

రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రికి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్వాగతం పలికారు.

శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం వద్దనున్న నాసిన్ కేంద్రంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి కావడం జరిగింది. ఈసందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితమ్మ, ఎంపీ బి.కె. పార్థసారథి మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛంను అందజేసి ఘన స్వాగతం పలికారు.

# తెలుగు భాషను సుసంపన్నం చేసింది పద్యమే

## –దాస్యం సేనాధిపతి, ప్రముఖ కవి, విమర్శకులు



హైదరాబాద్, జూన్ 6:తెలుగు భాషకే వన్నెతెచ్చిన పద్యం ద్వారా తెలుగు భాషలో పట్టు, భాషా సౌందర్యం, జీవన విలువల బోధన, భాషపై మక్కువ లాంటివి అనుభవంలోకి వస్తాయని తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాస్యం సేనాధిపతి అన్నారు.

ఈ రోజు నాగేశ్వరా డిగ్రీ పిజీ కళాశాల సమావేశ మందిరంలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం కరీంనగరం శాఖ నిర్వహించిన తెలుగు పద్య పఠన పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ తెలుగు పద్యాలను నేటి పిల్లలకు పరిచయం చేయాలని, మాతృభాష మాధుర్యాన్ని ఆస్వాదించాలని కోరారు. సమావేశ అధ్యక్షులు డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమ వరదలో తెలుగు కొట్టుకుపోతున్నదని, రేపటి తరానికి తెలుగు భాష పట్ల ఆదరణ తగ్గుతోందని, తెలుగు భాషలో పద్యాలను నేర్పడం ద్వారా పిల్లలకు భాష పట్లు అభిరుచి పారుతుందని అన్నారు. మాతృభాష తెలుగుతో పాటు జాతీయ భాష హిందీ, అంతర్జాతీయ భాష ఆంగ్లం తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. తెలుగు మాట్లాడితే అవమానకరం అనే భావనలు తొలగిన నాడే మన మాతృభాషకు ప్రాధాన్యం పెరుగుతుం దన్నారు. న్యాయ నిర్ణేతలు అన్నాడి గదేందర్ రెడ్డి, పండితులు రామ్మోహన్ శర్మలు మాట్లాడుతూ పోటీల నియమనిబంధనలు తెలియజేశారు. పద్యాన్ని స్పష్టంగా, రాగ యుక్తంగా పఠనం చేయడం పిల్లలు నేర్చుకోవాల న్నారు. తెలంగాణ తెలుగు భాష సంరక్షణ సంఘం కార్యదర్శి, కోశాధికారి అనుముల దయాకర్ సమన్వయకర్తగా సేవలు అందించి పోటీల నిర్వహణను సజావుగా నడిపించారు. ఈ కార్యక్రమంలో పోటీదారులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 'ఆరావళీ గ్రీన్ వాల్ ప్రాజెక్టు'లో భాగంగా ఆరావళీ శ్రేణిలో అటవీకరణకు సంకల్పం

న్యూఢిల్లీ, జూన్ 6:ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, మొక్కల పెంపకం కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొన్నారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని బలపరచడంలో భాగంగా ఆయన ఢిల్లీలోని భగవాన్ మహావీర్ వనస్థలి పార్కులో ఒక మొక్కను నాటారు.

ఆరావళీ గ్రీన్ వాల్ ప్రాజెక్టులో భాగంగా ఆరావళీ పర్వత శ్రేణుల్లో అటవీకరణకు ప్రాముఖ్యాన్ని ఇవ్వవలసి ఉందని కూడా శ్రీ మోదీ ప్రధానంగా చెప్పారు.

భూమి మీద అత్యంత పురాతన పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళీ పర్వతమాల గుజరాత్, రాజస్థాన్, హర్యానాలతో పాటు ఢిల్లీలో విస్తరించి ఉందని ప్రధాని గుర్తు చేశారు.

ఈ ప్రాంతం పర్యావరణ పరంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని చెబుతూ, ఆయా సవాళ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఆరావళీ శ్రేణిలోనూ, దానికి వెలుపలా సాంప్రదాయిక మొక్కల పెంపకం పద్ధతులను అనుసరించడానికి తోడు, చోటును కేటాయించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న ప్రాంతాల్లో ప్రత్యేకించి పట్టణ, సెమీ–అర్బన్ ప్రాంతాల్లో మేం కొత్త పద్ధతులను ప్రోత్సహించనున్నామని శ్రీ మోదీ చెప్పారు. మొక్కల పెంపకానికి సంబంధించిన కార్యకలాపాలకు జియో–ట్యాగ్ చేస్తారని, మేరీ లైఫ్ పోర్టల్ సాయంతో వాటిని పర్యవేక్షించనున్నారని కూడా శ్రీ మోదీ వివరించారు.

ఈ ఉద్యమంలో చురుకుగా పాలుపంచుకోవడంతో పాటు భూమి మీద హరిత కవచాన్ని పెంచడంలో తోడ్పాటును అందించాల్సిందిగా కూడా దేశ యువతకు ప్రధాని విజ్ఞప్తి చేశారు.

"ఈ రోజున, ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు, మేం మొక్కల పెంపకం దిశగా ప్రత్యేక చొరవను తీసుకొని, 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని పటిష్టపరిచాం. ఢిల్లీలోని భగవాన్ మహావీర్ వనస్థలి పార్కులో ఒక మొక్కను నేను నాటాను. ఇది ఆరావళీ గ్రీన్ వాల్ ప్రాజెక్టులో భాగంగా ఆరావళీ శ్రేణిలో తిరిగి వనాలను పెంచాలన్న మా ప్రయత్నాల్లో ఓ భాగం కూడా."

"గుజరాత్, రాజస్థాన్, హర్యానాలతో పాటు ఢిల్లీలోనూ విస్తరించిన ఆరావళీ పర్వత శ్రేణి మన భూగ్రహం మీద ఉన్న అతి పురాతన పర్వత శ్రేణుల్లో ఒకటి అనేది అందరికీ తెలిసిందే. ఈ పర్వత శ్రేణికి సంబంధించిన అనేక పర్యావరణ సవాళ్లు గత అనేక సంవత్సరాల్లో మన ముందుకు వచ్చాయి... వాటిని తగ్గించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ శ్రేణితో ముడిపడి ఉన్న ప్రాంతాలకు పునర్వైభవాన్ని తెచ్చేందుకు వేం దృష్టి కేంద్రీకరించాం. ఆయా ప్రాంతాల్లోని స్థానిక పాలనాయంత్రాంగాలతో కలిసి పనిచేయనున్నాం. దీనిలో భాగంగా నీటి వ్యవస్థలను మెరుగుపరచడం, ధూళిని వెంటబెట్టుకు వచ్చే తుపాన్లకు అడ్డుకట్ట వేయడం, థార్ ఎడారి తూర్పు దిక్కుకు వ్యాపించడాన్ని నిరోధించడం తదితర అంశాలపై శ్రద్ధ వహించబోతున్నాం."

"ఆరావళీ పర్వత శ్రేణిలోనూ, దానికి వెలుపలా, సాంప్రదాయిక మొక్కల పెంపకం పద్ధతులకు అదనంగా, మేం కొత్త పద్ధతులను ప్రోత్సహించనున్నాం.

ప్రత్యేకించి చోటు తక్కువగా ఉన్న పట్టణాలు, సెమీ–అర్బన్ ప్రాంతాల్లో ఈ పనిని చేస్తాం. మొక్కల పెంపకం కార్యకలాపాలకు జియో–ట్యాగింగును అవలంబిస్తారు. వాటిని 'మేరీ లైఫ్' పోర్టల్ ద్వారా పర్యవేక్షిస్తారు. మన దేశ యువతీయువకులు ఈ ఉద్యమంలో పాల్గొని, మన భూమి మీద హరిత కవచాన్ని పెంచడంలో తలో చేయి వేయాలంటూ వారికి నేను పిలుపునిస్తున్నాను."

# రైతులు ఆయిల్ ఫామ్ పంటల సాగుపై దృష్టి సారించాలి.. ఎమ్మెల్యే బొజ్జు పటేల్




ఆదిలాబాద్, జూన్ 6: రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఆయిల్ ఫామ్ పంటను పండించాలని, తద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు అందిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం కడెం మండల కేంద్రంలోని ఓ రైతు తన పంట పొలంలో పండించిన ఆయిల్ ఫామ్ మొదటి కోతను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోశారు.

అనంతరం కడెం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఉద్యాన అండ్ పట్టు పరిశ్రమ, ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫామ్ సాగు విధానం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ? ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలని, ప్రభుత్వం తరుపున అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. రైతులు తమ పంట పొలాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేసిన అనంతరం పంట కోతకు వచ్చే వరకు అంతర్గత పంటలను పండించవచ్చని తెలిపారు.

ఖానాపూర్ నియోజకవర్గంలోని రైతులు వ్యవసాయ, ఉద్యాన అండ్ పట్టు పరిశ్రమ శాఖల అధికారుల, శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటలను పండించి, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు అందించే పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం రైతులకు జిలుగు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఏఎంసీ పడిగేల భూషణ్, వైస్ చైర్మన్ మజీద్, పాండవాపూర్ పిఎసిఎస్ చైర్మన్ రామడుగు శైలజా రమేష్, ఖానాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పి.సతీష్ రెడ్డి, ఉద్యాన అండ్ పట్టు పరిశ్రమ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, రైతులు, పాల్గొన్నారు.

# మెగా డిఎస్సీ పరీక్షలు ప్రారంభం - ఆల్ ది బెస్ట్ చెప్పిన చంద్రబాబు

అమరావతి, జూన్ 6: ఏపీలో మెగా డీఎస్సీ 2025 పరీక్షలు నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఈ నియామక ప్రక్రియ చేపట్టారు. ఈ పరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పరీక్షలకు హాజరవుతున్న డీఎస్సీ అభ్యర్థులకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ మేరకు "ఒఖ ఆూఅ 2025 ఉపాధ్యాయ నియామక పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు శుభాకాంక్షలు!" అంటూ ఆయన ట్వీట్ చేశారు. అలాగే మంత్రి నారా లోకేష్ కూడా అభ్యర్థులకు శుభకాంక్షలు తెలిపారు.

ఇక, ఈ రోజు ప్రారంభమైన ఈ పరీక్షలు ఈ నెల 30 తేదీ వరకు కొనసాగుతాయి. ఈ మెగా డీఎస్సీ కోసం రాష్ట్రవ్యాప్తంగా 137, ఇతర రాష్ట్రాల్లో 17 మొత్తం 154 పరీక్షా కేంద్రాల్లో ప్రతిరోజూ రెండు షిఫ్టులలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం షిఫ్ట్ 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ 2:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతుందని అధికారులు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం అధికారులు కఠినమైన మార్గదర్శకాలను జారీ చేశారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని డీఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. అభ్యర్థులు సమయ పాలన పాటించాలని, పరీక్షా నిబంధనలను ఖచ్చితంగా అనుసరించాలని ఆయన సూచించారు.


కొంతమంది అభ్యర్థుల హాల్ టికెట్లపై ఫోటోలు లేని కారణంగా, అలాంటి వారు తమ వెంట రెండు తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను తీసుకురావాలని అధికారులు తెలిపారు. అలాగే హాల్ టికెట్లలో ఏవైనా తప్పులు ఉంటే, అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా ఓటర్ ఐడీ వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు న్యూఢిల్లీలోని తన నివాసంలో సిందూర్ మొక్కను నాటిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 6:ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ న్యూఢిల్లీలోని తన నివాసంలో సిందూర్ మొక్కను నాటి దానికి నీళు పోశారు. గుజరాత్‌లో కచ్ఛ్‌కు చెందిన సాహసిక మాతృమూర్తులు, సోదరీమణులు కానుకగా ఆయనకు అందజేసిన మొక్క అది. 1971లో భారత్–పాకిస్తాన్ యుద్ధ కాలంలో కచ్ఛ్‌కు చెందిన మాతృమూర్తులు, సోదరీమణులు మొక్కవోని ధైర్య–సాహసాలతో పాటు గొప్ప దేశభక్తిని ప్రదర్శించారు. ప్రధాని ఇటీవల గుజరాత్‌లో పర్యటించిన సంగతిని గుర్తుచేసుకున్నారు...నాకు బహుమతిగా ఇచ్చిన సిందూర్ మొక్క మన దేశ నారీశక్తి శౌర్యంతో పాటు ప్రేరణకు కూడా ఒక ప్రబలమైన ప్రతీకగా అలరారుతుందని ప్రధానమంత్రి అన్నారు.

"1971 లో యుద్ధంలో ధైర్య–సాహసాలు, పరాక్రమాలకు అద్భుత ఉదాహరణను అందించిన కచ్ఛ్‌కు చెందిన వీరాంగనలైన మాతృమూర్తులు, సోదరీమణులు ఇటీవల నేను గుజరాత్‌లో పర్యటించినప్పుడు నాకొక సిందూర్ మొక్కను కానుకగా ఇచ్చారు. ఆ మొక్కను ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ రోజున న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసంలో నాటి నీళ్లు పోసే సౌభాగ్యం నాకు దక్కింది. ఈ మొక్క మన దేశ నారీశక్తి శౌర్యానికీ, స్ఫూర్తికీ శక్తిమంతమైన ప్రతీకగా నిలిచివుంటుంది."


## అందరికీ ఆత్మీయ ఆహ్వానం



నైజీరియన్ - అమెరికన్ రచయిత్రి
చిమమండా న్గోజి అడిచె
"ఫెమినిస్ట్ మేనిఫెస్టో - ప్రసంగాలు"
పి. సత్యవతి తెలుగు అనువాదం
పరిచయ కార్యక్రమం

తేది : 15 జూన్, 2025
సమయం : సా॥ 6 గ॥లకు
స్థలం : నాగాల్యాండ్స్, సీతారామపురం, విజయవాడ.

ఆత్మీయ వక్తలు : నండూరి రాజగోపాల్ గారు
బండ్ల మాధవరావు గారు
జి. లక్ష్మి గారు
వి. ప్రతిమ గారు
కొండవీటి సత్యవతి గారు
ఆత్మీయ స్పందన : పి. సత్యవతి గారు

★ సాహితీ స్నేహ బృందం, విజయవాడ
★ రుద్రమ ప్రచురణలు, వరంగల్లు


# హరిత భవితను నిర్మించడంలో భారతీయ రైల్వేల పాత్రపై వచ్చిన వ్యాసాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 6:హరిత భవితను నిర్మించడంలో భారతీయ రైల్వేలు ఏ విధంగా కీలక పాత్రను పోషిస్తోంది వివరిస్తూ కేంద్ర రైల్వేల శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకన్నారు. విద్యుదీకరణ పనులు శరవేగంగా పూర్తి అవుతూ ఉండడం, స్వచ్ఛ ఇంధనం వైపు మరలుతూ ఉండడంతో భారతీయ రైల్వేలు నికర శూన్య ఉద్గారాల (నెట్ జీరో ఎమిషన్స్) లక్ష్యాన్ని సాధించే మార్గంలో పయనిస్తున్నాయని శ్రీ మోదీ అన్నారు.

కేంద్ర మంత్రి రాసిన ఒక వ్యాసానికి ప్రధానమంత్రి కార్యాలయం ప్రతిస్పందిస్తూ ఎక్స్‌లో ఒక సందేశాన్ని ఈ కింది విధంగా పోస్టు చేసింది: "హరిత భవితను నిర్మించడంలో భారతీయ రైల్వేలు ఏ విధంగా కీలక పాత్రను పోషిస్తోందీ రైల్వేల శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒక వ్యాసం రాశారు. విద్యుదీకరణ పనులు శరవేగంగా పూర్తి అవుతూ ఉండడం, స్వచ్ఛ ఇంధనం వైపు మళ్లుతూ ఉండడంతో భారతీయ రైల్వేలు నికర శూన్య ఉద్గారాల లక్ష్యాన్ని సాధించే మార్గంలో పయనిస్తున్నాయి."

# జిల్లా వాసులకు ప్రతిష్టాత్మకమైన యోగ భూషణ్ అవార్డులు

అమరావతి, జూన్ 6:కర్నూలు జిల్లాకు చెందిన యోగ గురువులు డాక్టర్ ఎస్.ముంతాజ్ బేగం, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టిలకు అఖిల భారత యోగ శిక్ష సంఘం జాతీయ అధ్యక్షులు మంగేష్ త్రివేది ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో అదియోగి యోగ భూషణ్ అవార్డులను ప్రకటించారు.

12సంవత్సరాలకు పైగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్విరామంగా యోగాలో సేవలందిస్తున్న వారికి ఈ జాతీయ వార్డు ప్రధానం చేస్తున్నట్లు మంగేష్ త్రివేది తెలిపారు. ఈ సందర్భంగా అవినాష్ శెట్టి, ముంతాజ్ బేగంలు మాట్లాడుతూ.. అఖిల భారత యోగ శిక్ష మహా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన ఢిల్లీలో అవార్డు అందుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. తమను ప్రోత్సహించిన వారికి రావడం పట్ల రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, కర్నూలు జిల్లా ఒలంపిక్ సంఘం సీఈఓ విజయ్ కుమార్, అధ్యక్ష కార్యదర్శులు కేఈ జగదీష్ కుమార్, శ్రీనివాసులు, క్రీడా సంఘాల కార్యదర్శులు డాక్టర్ రుద్రారెడ్డి, ఈశ్వర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 6:ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి అశోకా రోడ్, 6లోని తన అధికారిక నివాసం వద్ద మొక్కలు నాటారు. తెలంగాణలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరంతా ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వారి కృషిని గుర్తించిన శ్రీ జి. కిషన్ రెడ్డి ఆధునిక పర్యావరణ యోధులుగా మారాలన్నారు.

పర్యావరణాన్ని మరింత పచ్చగా, మెరుగ్గా తయారు చేసేందుకు క్షేత్ర స్థాయిలో కృషి చేస్తున్న వారిని మంత్రి అభినందించారు. ప్లాస్టిక్ కాలుష్య ప్రభావంపై పెరుగుతున్న శాస్త్రీయ ఆధారాలను తెలియజేయడమే ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ లక్ష్యం. అలాగే స్వచ్ఛమైన, సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని తిరస్కరించడం, తగ్గించడం, పునర్వినియోగం, రీసైకిల్ చేయడం వంటి చర్యలను ప్రోత్సహిస్తుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలు సమష్టి ప్రయత్నాలు చేయాలని మంత్రి సూచించారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం.. రైతుల హర్షం

తిరుపతి, జూన్ 6: కష్టకాలంలో మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. రాష్ట్రస్థాయిలో తోతాపూరి రకం మామిడికి మద్దతు ధరను ప్రకటించింది. తోతాపూరి రకానికి టన్నుకు మద్దతు ధర 12 వేల రూపాయలుగా నిర్ణయించింది. ఇందులో మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలు 8 వేల రూపాయలను మామిడి రైతులకు అందజేస్తారు. మరో నాలుగు వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించడంతో మామిడి రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రైతులు ఉత్సాహంతో మామిడి పంటను కోయడానికి సిద్ధమవుతున్నారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పాలస్తీనా యుద్ధం కారణంగా చిత్తూరు జిల్లా నుంచి గత మూడు సంవత్సరాలుగా మామిడి పండ్ల ఎగుమతి ఆగిపోయింది. దీంతో ఫ్యాక్టరీలలో మామిడి నిల్వలు పేరుకుపోతున్నాయి. తొలుత కరోనా పేరుతో మామిడి ఎగుమతులకు బ్రేక్ పడింది. అనంతరం యుద్ధం కారణంగా మరో రెండు సంవత్సరాలు ఆగిపోయాయి. దీంతో మామిడి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా గత మూడు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొంతమంది రైతులు మామిడిని తీసివేసి ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పర్యాయం చిత్తూరు జిల్లాలో సగం పంట వచ్చింది. జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల టన్నుల మామిడి దిగుబడి రావొచ్చని ఉద్యానవన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

అయితే తోతాపూరి మామిడికాయలను తీసుకోవడానికి మొదటి నుంచి మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలు సుముఖత వ్యక్తం చేయడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయం మీద ప్రత్యేక దృష్టిని సారించింది. మూడు పర్యాయాలు మామిడి రైతులు, ఫ్యాక్టరీల యజమానులతో సమావేశాలను ఏర్పాటు చేసింది. ఈ సమావేశాల్లో హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసన్ కూడా పాల్గొన్నారు. రైతుల కష్టసుఖాలతో పాటు ఫ్యాక్టరీ యజమానుల లాభనష్టాలను కూడా తెలుసుకున్నారు. దీనికి తోడు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా మామిడి రైతుల మీద దృష్టిని సారించారు. జిల్లా కలెక్టర్ కు జిల్లాలోని శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా సహకరించారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల పరిస్థితిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విపులంగా వివరించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు మద్దతు ధర మీద కసరత్తును ప్రారంభించింది.

ఫ్యాక్టరీ యజమానులతో సమావేశం నిర్ణయించి మద్దతు ధరను నిర్ణయించే ప్రయత్నం జరిగింది. అయితే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను ఇవ్వడానికి ఫ్యాక్టరీ యజమానులు ముందుకు రాలేదు. ఫ్యాక్టరీలను ప్రారంభించేది లేదని స్పష్టం చేశారు. కిలో మామిడి ఐదు రూపాయల వంతున అయితే కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ విషయంలో గురువారం మరోసారి మామిడి ఫ్యాక్టరీల యజమానులతో, మామిడి రైతులతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ఇరువర్గాల వాదనలను సావధానంగా విన్నారు. పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లారు. ఇప్పటికే పరిస్థితి అదుపు తప్పిందని, ఈ విషయం ఆలస్యం జరిగితే జిల్లాలో శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని వివరించారు.

ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం కూడా వేగంగా స్పందించింది. గురువారం రాత్రి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విలేకరుల సమావేశంలో మామిడికి మద్దతు ధరను ప్రకటించారు. చిత్తూరు జిల్లాలో నిర్ణయించిన ప్రకారం 12 వేల రూపాయల మద్దతు ధర కొనసాగుతుందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలు రైతులకు ఎనిమిది వేల రూపాయలు చెల్లిస్తే, ప్రభుత్వం తరఫున మరో నాలుగు వేల రూపాయలను చెల్లిస్తామని వివరించారు. మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మరోసారి భరోసా ఇచ్చారు. దీంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మామిడి రైతులు, రైతు సంఘం నాయకులు అభినందిస్తున్నారు. మద్దతు ధరను ప్రకటించడానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పార్లమెంటు సభ్యుడు ప్రసాదరావుకు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. తొందరగా విధి విధానాలను రూపొందించి మామిడి క్రషింగ్ కు ఏర్పాట్లు చేయాల్సిందిగా కోరుతున్నారు.

# బాలికను ఎత్తుకెళ్లి అత్యాచారం చేసిన నిందితుడి కాల్చివేత

లక్నో జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మూడేళ్ల బాలికను ఎత్తుకెళ్లి చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడిని పోలీసులు కాల్చి చంపారు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దంపతులు బాలిక కలిసి ఆరుబయట పడుకున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో బాలిక ఏడుపు వినిపించడంతో ఓ వృద్ధుడు ఆ దంపతులకు సమాచారం ఇచ్చాడు. 500 మీటర్ల దూరంలో బాలిక కనిపించడంతో లోకబంధు ఆస్పత్రికి తరలించారు. బాలిక ప్రైవేటు పార్ట్స్ వద్ద గాయాలు ఉండడంతో అత్యాచారం జరిగిందని వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిసి కెమెరాలు ఆధారంగా దీపక్ వర్మ అత్యాచారం చేసి ఉంటాడని గుర్తించారు. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని దేవి కేడా ప్రాంతంలో అతడు సంచరిస్తుండగా పోలీసులు లొంగిపోవాలని కోరారు. పోలీసులపై దీపక్ కాల్పులు జరపాడు. దీంతో నిందితుడిపై పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు.

# భూ సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి.. జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్




కరీంనగర్, జూన్ 6:గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను తప్పనిసరిగా పరిష్కారం చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తైన వాటిని వెంటనే ఆన్ లైన్లో నమోదు చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతీ దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని, భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్ తహసిల్దార్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# మిడిల్ క్లాస్ జాబ్‌లపై ఏఐ పిడుగు..

**–జనరేషన్ 'జెడ్' సంప్రదాయ ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం**
**–ఐదు రంగాల్లో కొలువులను ఆక్రమిస్తున్న కృత్రిమ మేధ**
**–సవాళ్లను అర్థం చేసుకోవడం ముఖ్యమని నిపుణుల సూచన**

న్యూఢిల్లీ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఉద్యోగ మార్కెట్‌ను వేగంగా మార్చేస్తున్న కృత్రిమ మేధ (ఏఐ–ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) నుంచి జనరేషన్ జెడ్ ఊహించని సవాళ్లను ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా మధ్యతరగతి యువత కెరీర్‌కు ఎంతగానో దోహదం చేసే సంప్రదాయ అరంగేట్ర స్థాయి (ఎంట్రీ లెవల్) ఉద్యోగాలపై ఏఐ పిడుగు వేసింది. ఏఐ వ్యవస్థలు ప్రాథమిక స్థాయి విధులను వేగంగా, మానవ కార్మికుల కంటే తక్కువ ఖర్చుతో చేస్తుండటంతో నవతరానికి ఉద్యోగాలు దొరకడమే సవాల్‌గా మారుతున్నది.

నైపుణ్యాభివృద్ధికి, పని ప్రదేశంలో నలుగురితో కలివిడిగా ఉండే అవకాశానికి, కెరీర్ నెట్‌వర్కింగ్ లాంటి కీలక అవకాశాలను అందించే సంప్రదాయ ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తున్నది. దీంతో యువ ప్రొఫెషనల్స్ తాము ఎంచుకున్న రంగాల్లో ముందుకు సాగడానికి సరైన దారిని ఏర్పరుచుకోలేకపోతున్నారు. మధ్యతరగతి యువతరం ఎక్కువగా ఉద్యోగాలు చేసే అయిదు ప్రధాన రంగాల్లో వారి ఉద్యోగ అవకాశాలను కృత్రిమ మేధ గండికొడుతున్నది.

ఏయే రంగాలపై ఏఐ ప్రభావం పడుతుందంటే..

1.టెక్/సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో కోడింగ్ ఉద్యోగాలు మాయం

సాధారణంగా జూనియర్ డెవలపర్స్ హ్యాండిల్ చేసే కోడింగ్ పనులు ఇప్పుడు ఏఐ చక్కబెట్టేస్తున్నది. గిట్‌హబ్, కోపైలట్ కోడ్ జనరేటింగ్ మోడల్స్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చాయి. ఏఐ టూల్స్ ఇప్పుడు కోడింగ్ పనులను అనుభవం లేని ప్రోగ్రామర్లు చేసే తప్పుల కన్నా తక్కువ తప్పులతో వేగంగా చేస్తున్నాయి. దీంతో కంపెనీలు ఏఐ టూల్స్‌తో కోడింగ్ రాయిస్తున్నాయి.

2.తగ్గుతున్న న్యాయ సేవలు, జూనియర్ రిసెర్చ్, క్లరికల్ సేవలు

ఎవిసోర్ట్, లెక్సిస్‌నెక్సిస్, కేస్‌టెక్స్ట్ లాంటి ఏఐ టూల్స్ వల్ల న్యాయ రంగంలోని జూనియర్ ప్రొఫెషనల్స్ సవాళ్లను ఎదుర్కొంటున్నారు. దస్త్రాల సమీక్ష, న్యాయ పరిశోధన, కాంట్రాక్టుల విశ్లేషణ లాంటి పనులను ఏఐ బాగానే చేస్తున్నది. గోల్డ్‌మన్ శాక్స్ అంచనా ప్రకారం 2023 నాటికే 44 శాతం న్యాయ రంగ పనులు ఆటోమేటెడ్ అవుతాయి. దీని ప్రభావం పారా లీగల్, జూనియర్ అసోసియేట్స్ పైన పడింది. ఏఐ ప్రభావం వల్ల జూనియర్ లీగల్ ప్రొఫెషనల్స్‌కు కీలక అభ్యసన అవకాశాలు తప్పిపోతున్నాయి.

3.రిటైల్, కస్టమర్ సర్వీస్‌లో పెరుగుతున్న 'బాట్స్' వాడకం

అత్యాధునిక నైపుణ్య డిగ్రీలు లేనివారు రిటైల్, కస్టమర్ సర్వీసుల్లో ఉద్యోగాలు వెతుక్కోవడం పరిపాటే. ఈ ఉద్యోగాలు క్షేత్ర స్థాయిలో వ్యాపార నిర్వహణ అవకాశాలను, ప్రాథమిక పని ప్రదేశ నైపుణ్యాల అభివృద్ధికి, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్యల పరిష్కార సామర్థ్యాల వృద్ధికి తోడ్పడతాయి. అయితే ఎయిర్‌పోర్టుల్లో స్వీయ తనిఖీ టెర్మినల్స్ లాంటివి పుట్టుకు రావడం ఈ రంగంలో వస్తున్న మార్పులను సూచిస్తున్నాయి. రొటీన్‌గా ఉండే విచారణలకు ఏఐ చాట్ బాట్స్, ఆటోమెటెడ్ రెస్పాన్స్ సిస్టమ్స్ సమర్థంగా సమాధానాలు చెప్తున్నాయి. ప్రాథమిక లావాదేవీలను అవి పూర్తి చేసి క్లిష్టమైన సమస్యలను మానవ రిప్రజెంటేటివ్స్‌లకు పంపిస్తుండటంతో మొత్తంగా కస్టమర్ సర్వీస్ ఉద్యోగాల అవసరం తగ్గుతున్నది.

4.మార్కెటింగ్, కంటెంట్ క్రియేటింగ్‌లో జూనియర్ స్థానాల ఆక్రమణ

ప్రాథమిక మార్కెటింగ్ మెటీరియల్, గ్రాఫిక్ డిజైన్స్, సోషల్ మీడియా కంటెంట్‌ను ఏఐ టూల్స్ తయారు చేయగలుగుతున్నాయి. దీంతో ఈ రంగంలో జూనియర్–లెవల్ ఉద్యోగుల కొలువులకు ఎసరు వచ్చింది. దీంతో వారికి ప్రత్యక్ష పని అనుభవం, రియల్ క్లయింట్స్, క్యాంపెయిన్ల అనుభవం దక్కడం లేదు.

5.అడ్మినిస్ట్రేటివ్, ఆఫీస్ సపోర్ట్ కొలువుల్లో ఏఐ అరంగేట్రం

ఈ రంగంలోని ఉద్యోగాలు కీలకమైన 'లాంచ్ ప్యాడ్' లాంటివి. ఇవి తాజా పట్టభద్రులకు వివిధ పరిశ్రమల్లో ప్రొఫెషనల్ నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పడతాయి. అయితే ఏఐ డాటా ఎంట్రీ, షెడ్యూలింగ్, జనరల్ ఆఫీస్ అసిస్టెన్స్ ఆటోమేషన్ లాంటి ఏఐ ఉపకరణాలు మధ్యతరగతి యువతకు అవసరమైన పునాది స్థాయి కెరీర్ అవకాశాలను తొలగిస్తున్నాయి. ఈ రంగంలో మనుషుల కన్నా ఏఐ సమర్థంగా విధులను నిర్వహిస్తుందని చాలా మంది ఉద్యోగులను నియమించుకొనే మేనేజర్లు భావిస్తున్నారని తాజా సర్వే ఒకటి తెలిపింది. కొత్త ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగులుగా నియమించుకోవడంతో అయ్యే ఖర్చుతో పోలిస్తే తక్కువ ఖర్చుతో ఏఐతో పనులు జరిగిపోతుండటమే ఇందుకు కారణం. దీంతో యువ ప్రొఫెషనల్స్ కమ్యూనికేషన్ స్కిల్స్ లాంటివి మెరుగుపరుచుకోలేకపోతున్నారు.

# బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్‌రావు శవరాజకీయాలు చేస్తున్నారు

**–ఐఎన్‌టీయూసీ సంపత్ కుమార్**

–హైదరాబాద్ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్‌రావు శవరాజకీయాలు చేస్తున్నారని ఐఎన్‌టీయూసీ సంపత్ కుమార్ తెలిపారు. బిఆర్ఎస్ రాజకీయ కుట్రలో భాగంగానే ధన్వాడ ఘటన జరిగిందని, రైతులపై బిఆర్ఎస్ కార్యకర్తలు దాడులు చేశారని మండిపడ్డారు. ఇథనాల్ కంపెనీకి అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుమతులు ఇచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి అనుమతి ఇవ్వలేదని సంపత్ కుమార్ తెలియజేశారు. రైతుల భూములను ప్రభుత్వం లాక్కోలేదని స్పష్టం చేశారు. ప్రజల జీవితాలతో హరీష్‌రావు రాజకీయం చేయొద్దని సూచించారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం రాజోలి మండల పరిధిలో పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మించతలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై 12 గ్రామాల ప్రజలు దాడి చేసిన విషయం తెలిసిందే.

# డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్య చెడిన స్నేహబంధం

**– 14 శాతం పతనమైన టెస్లా షేర్లు..**
**–మస్క్‌కు రూ.13 లక్షల కోట్ల నష్టం**

న్యూ ఢిల్లీ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య స్నేహబంధం చెడింది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వైఖరిని తప్పుబడుతున్నారు. ఇటీవల డోజ్ శాఖ నుంచి వైదొలిగిన మస్క్.. బహిరంగంగానే ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అదేసమయంలో మస్క్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మస్క్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయన సంస్థ టెస్లా షేర్లు భారీగా పతనమయ్యాయి గురువారం నాటి ట్రేడింగ్‌లో టెస్లా షేర్లు ఏకంగా 14శాతం పతనమయ్యాయి. దాదాపు 152 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.13 లక్షల కోట్లన్నమాట. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 1 ట్రిలియన్ మార్క్‌ను కోల్పోయి 916 బిలియన్ డాలర్లకు పడిపోయింది. టెస్లా సంపద ఒక్క రోజులోనే ఈ స్థాయిలో తరిగిపోవడం సంస్థ చరిత్రలోనే ఇదే తొలిసారి కావడం గమనార్హం. అమెరికన్లకు పన్ను తగ్గించేందుకు బిగ్ ట్యాక్స్ బ్రేక్ బిల్లును ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చింది. ట్రంప్–మస్క్ మధ్య దూరానికి ఈ బిల్లే ప్రధాన కారణమని చెప్తున్నారు. ఈ బిల్లుతో ధనికులకు 4.5 లక్షల కోట్ల డాలర్ల మేర లబ్ధి చేకూరి, పేదలకు ఉద్దేశించిన సంక్షేమ పథకాలు మరుగున పడుతాయని మస్క్ తప్పుబడుతున్నారు. ఇదో అసహ్యకరమైన బిల్లుగా ఆయన అభివర్ణించారు. రుణ పరిమితిని పెంచి అమెరికా ఆర్థికాన్ని దివాలా తీయించేలా ఉన్న ఇలాంటి బిల్లుకు మద్దతిచ్చిన వారికి సిగ్గు ఉండాలని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'కిల్ ది బిల్' అంటూ ట్వీట్ చేశారు. అయితే, ఎలక్ట్రిక్ కార్లకు రాయితీ తగ్గింపు అంశం బిల్లులో ఉండటం వల్లే మస్క్ దీన్ని వ్యతిరేకిస్తున్నారని ట్రంప్ వర్గం ఎదురుదాడికి దిగుతున్నది.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు దోహదపడుతున్నాయి : సంగారెడ్డి ఎస్పీ



సంగారెడ్డి, జూన్ 6: జహీరాబాద్ పట్టణంలో నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు దోహదపడుతాయని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోజ్ పంకజ్ అన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో పిరమిల్ కంపెనీ సహకారంతో ఏర్పాటు చేసిన 93 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ పరితోజ్ పంకజ్ మాట్లాడుతూ.. అధునిక సాంకేతికతను కలిగిన సీసీ కెమెరాలను పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్, పట్టణంలోని ఎంట్రీ, ఎగ్జిట్‌లలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి నిషేధిత గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా నియంత్రించేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యత చాలా కీలకంగా మారుతుందని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని అన్నారు. పట్టణంలోని సీసీ కెమెరాలను ఏర్పాటుకు సహకరించిన పిరమిల్ కంపెనీ అధికారులకు అభినందించారు. ఈ సీసీ కెమెరా ఏర్పాటులో పట్టణ, మండల, గ్రామాల్లో ప్రజలు, వ్యాపారులు, యువత సహకరించాలని తెలిపారు.

అనంతరం గత నెల 26వ తేదిన న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్‌లో హత్యకు గురైన బోరెంచ రాణెమ్మ ఛేదించి నేరస్తున్ని పట్టుకున్న జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్, క్రైం బ్రాంచ్ పోలీసులు ఓందేవ్, అస్లాం, అనంద్, హరితేజ, పోలీసులు రాజశేఖర్, సుభాష్, రవికుమార్, సాయికుమార్, భరత్‌గౌడ్‌లను జిల్లా ఎస్పీ పరితోజ్ పంకజ్ అభినందించి, రూ. 10 వేల రివార్డును అందజేశారు. అనంతరం చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాడ్గి గ్రామ శివారులోని అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. బక్రీద్ పండగ సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి గోవులను అక్రమంగా తరిలించకుండా వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. అనంతరం చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో క్రైంరేట్‌తో పాటు నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎస్ఐ రాజేందర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

# చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, జూన్ 6:చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులతో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రైల్వే టెర్మినల్‌కు వచ్చే రహదారి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. రైల్వే టెర్మినల్‌కు వచ్చే ప్రయాణికుల వాహనాలకు పార్కింగ్ స్థలం కల్పించాలన్నారు. రైల్వే టెర్మినల్‌లో సరైన వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైల్వే టెర్మినల్, పరిసర ప్రాంతాలలో విధిదీపాల నిర్వహణను మెరుగుపర్చాలన్నారు. ఇటీవల గాలివానకు దెబ్బతిన్న టెర్మినల్ పైకప్పు మరమ్మతు పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు.

# సకల సౌకర్యాలతో ప్రభుత్వ బడులు : ఎంపీడీవో డానియల్

హైదరాబాద్, జూన్ 6: నేడు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో డేనియల్ పేర్కొన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పుస్తకాలు, దుస్తులు మధ్యాహ్న భోజనం అన్ని సౌకర్యాలతో విద్యను అందిస్తున్నామని తెలిపారు. అహ్లాదకరమైన వాతావరణంలో క్రీడా పోటీలు సైతం నిర్వస్తున్నామని తెలిపారు.

మండల విద్యాధికారి చంద్రప్ప మాట్లాడుతూ బయట ఉన్న పిల్లల్ని బడిలో చేర్పించాల్సిందిగా గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక పాఠశాల సిబ్బంది ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామస్తులు సహకరిస్తేనే ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు అవకాశం ఉంటుందని ఆయన చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో సంగయ్య స్వామి, నక్కల బొందయ్య. చంద్రశేఖర్, ఉమాదేవి, ఎంపీవో సురేందర్ రెడ్డి, కార్యదర్శి అనంత రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. లారీ ఆటో ఢీకొని ఇద్దరు మృతి

మెదక్, జూన్ 6: సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, ఆటో ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందారు.

పోలీసుల కథనం ప్రకారం.. కొండాపూర్ మండలం సైదాపూర్ తండాకు చెందిన అభిషేక్ (13), సాయికిరణ్ (22)లు సదాశివపేట వైపు నుంచి ఆటోలో మామిడి పండ్లను తీసుకెళ్తున్నారు. కంబాలపల్లి చౌరస్తా వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న ఆటో, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయ్యింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# మాదాపూర్ కేబుల్ వంతెనపై కారులో చెలరేగిన మంటలు

హైదరాబాద్, జూన్ 6: మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై వేగంగా వెళున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో కారు మొత్తం మంటలు వ్యాపించి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏలాంటి గాయాలు కాలేదు.

పోలీసులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 4.15 గంటల సమయంలో మియాపూర్‌కు చెందిన శ్రీరాంరెడ్డి హోండా కారు (ఏపి09సిఏ1878)లో ఇనార్బిట్ మాల్ వైపు నుంచి కేబుల్ బ్రిడ్జి మీదుగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 45 వైపు వెళ్తున్నాడు. కారు కేబుల్ బ్రిడ్జి మీదకు చేరుకోగానే ఇంజిన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే కారును రోడ్డుపై నిలిపివేసి అందులో ఉన్న ఇద్దరు బయటకు వచ్చారు. క్షణాల్లో కారులో మొత్తం మంటలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో, మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు కేబుల్ బ్రిడ్జి మీదకు చేరుకొని ట్రాఫిక్‌ను మళ్లించారు. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు.

కారు ఇంజిన్‌లో ఎలక్ట్రికల్ సమస్యతో ఈ అగ్నిప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. ఐటీ ఉద్యోగులు ఇండ్లకు వెళ్లే సమయం కావడంతో ఐకియా నుండి రోడ్డు నెంబర్ 45 రూట్‌లో ట్రాఫిక్ జాం ఏర్పడింది. ప్రమాదానికి గురైన కారుపై సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ, వరంగల్ కమిషనరేట్ల పరిధిలో 17 ట్రాఫిక్ చలాన్లు ఉన్నాయి. ఓవర్ స్పీడ్‌తో కారు డ్రైవింగ్ చేయడం, నో పార్కింగ్ జోన్‌లో కారును పార్కింగ్ చేయడం వంటి చలాన్లు ఎక్కువగా ఉన్నాయి. 2019 నుండి ఇప్పటి వరకు ఈ కారుపై రూ.11490 ఫైన్ పెండింగ్‌లో ఉంది.

# చోరీకి గురైన వంద సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగింత



ఆదిలాబాద్, జూన్ 6:ఆదిలాబాద్ జిల్లాలో చోరీకి, గల్లంతైన సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో 15 రోజుల వ్యవధిలో వంద సెల్‌ఫోన్లను శుక్రవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశం హాల్‌లో బాధితులకు తిరిగి అప్పగించారు. వీటి విలువ దాదాపు రూ. 13 లక్షల విలువ ఉంటుందని ఎస్పీ వెల్లడించారు.

ముఖ్యంగా రాబట్టిన మొబైల్ ఫోన్లు హర్యానా , మహారాష్ట్ర లలో ఉండటం వాటిని ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో తిరిగి రాబట్టడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 800 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశామని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. బాధితులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే పోలీస్ స్టేషన్‌నుగాని https:// www.ceir.gov.i n అనే వెబ్‌సైట్‌లో గాని సంప్రదించాలని సూచించారు. మీసేవ సెంటర్లలో చలాన్లు కట్టవలసిన అవసరం లేదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, పట్టణ సీఐలు బి సునీల్ కుమార్, సీహెచ్ కరుణాకర్ రావు, కె ఫణిదర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి వెంకటి, ప్రత్యేక బృందం సభ్యులు పి గోపి కృష్ణ, ఎస్ సంజీవ్, ఎం ఎ రియాస్, మజీద్, జి త్రిశూల్, నవనీత్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోస్టర్ ప్రకారమే ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు : జీఎం విజయభాస్కర్ రెడ్డి

ఆదిలాబాద్, జూన్ 6:బెల్లంపల్లి ఏరియాలో అన్ని పదోన్నతులు రోస్టర్ ప్రకారమే జరుగుతున్నాయని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఎస్టీ రోస్టర్ రిజిస్టర్ వెరిఫికేషన్ కార్పొరేట్ కమిటీ సభ్యులు శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు.

బెల్లంపల్లి ఏరియా లో విధులు నిర్వహిస్తున్న ఎస్టీ ఉద్యోగుల రోస్టర్‌ను కార్పొరేట్ చీఫ్ లైసెన్స్ అధికారి , ఇల్లందు ఏరియా జీఎంవి. కృష్ణయ్య తనిఖీ చేశారు.


ఎస్టీఉద్యోగుల ఖాళీల భర్తీ , పదోన్నతులకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జీఎం విజయభాస్కర్ రెడ్డి కమిటీ సభ్యులకు స్వాగతం పలికిన అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఎస్వో –2 జీఎం రాజమల్లు, కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ భాస్కరరావు ,ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు ,వర్కింగ్ ప్రెసిడెంట్ పంతుల, ఏరియా లైసెన్స్ అధికారి శ్రీరాములు, ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డి మల తిరుపతి, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహరా ,సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ , జూనియర్ అసిస్టెంట్ అర్చన, ఏరియా ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# 11 ఏళ్ల మోదీ పాలనలో దేశానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు...

-వరల్డ్ నెంబర్ 1 లీడర్ ప్రధాని మోదీ....

-వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా , చారిత్రక , సాహసోపేత నిర్ణయాలతో 11 ఏళ్ల మోదీ ప్రభుత్వ పాలన....

-11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం... సంకల్ప సాకారం పేరిట చేపట్టాల్సిన కార్యక్రమాలను విజయవంతం చేయాలి...



కరీంనగర్, జూన్ 6:(నేటినిజం ప్రతినిధి) 11 ఏళ్ల ప్రధాని మోదీ పాలనలో దేశానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, గ్లోబల్, వరల్డ్ మోస్ట్ పాపులర్ నంబర్ వన్ లీడర్ స్థానంలో ప్రధాని మోదీ ఉన్నారని, వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా , చారిత్రక సాహసోపేత నిర్ణయాలతో 2014 నుండి మోడీ ప్రభుత్వ పాలన విజయవంతంగా కొనసాగుతుందని బిజెపి నాయకులు, తిమ్మాపూర్ మండలం ఇన్చార్జి గుజ్జ శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తెలిపారు. బిజెపి జాతీయ అధ్యక్షులు జేపి నడ్డా ఆదేశానుసారం , రాష్ట్ర పార్టీ సూచన మేరకు, 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వం - సంకల్ప సాకారం పేరిట తిమ్మాపూర్ మండలంలో చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాల కోసం శుక్రవారం రోజున మహాత్మా నగర్ లోని శ్రీ తపాలా లక్ష్మీనరసింహస్వామి దేవాలయ కళ్యాణ మండప ప్రాంగణంలో స్థానిక నాయకులు కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుజ్జ సతీష్, అధ్యక్షత వహించిన బొంతల కళ్యాణ్ చంద్ర లు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్ధవంతమైన , నాయకత్వంలో భారతదేశ దిశా దశ మారిందన్నారు. ఆత్మనిర్బార్ భారత్ , మేకిన్ ఇండియాతో దేశం తిరుగులేని శక్తిగా అవతరించిందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకున్న సంచలన, చారిత్రక నిర్ణయాలు దేశాన్ని ప్రగతి పతంలోకి తీసుకువెళ్లాయన్నారు.

మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. ఉగ్రవాదుల స్థావరాలను మట్టు పెట్టి ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ కు వెన్నులో వణుకు పుట్టించి దాయాదిదేశంపై సాధించిన చారిత్రక విజయంతో దేశ కీర్తి , ఖ్యాతి విశ్వంలో మార్మోగిపోతుందన్నారు. అందుకే 11 ఏళ్ల మోదీ విజయవంత పాలన ప్రస్థానంపై జాతీయ పార్టీ పిలుపుమేరకు 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వ... సంకల్ప సాకారం పేరిట పలు కార్యక్రమాలను , ప్రోగ్రాంలను చేపట్టాలని జాతీయ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ ప్రోగ్రాంలన్నీ బిజెపి శ్రేణులు అందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అందులో ప్రధానంగా జూన్5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 15 రోజులపాటు తమ తమ ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ముఖ్యంగా అమ్మ పేరిట ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు . అలాగే 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం, 23న డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్, 25న ఎమర్జెన్సీ డే లాంటి ముఖ్య కార్యక్రమాలను చేపట్టాలని , పార్టీ సూచన పత్రంలో అన్ని కార్యక్రమాలను విజయవంతం చేపట్టాలని సందర్భంగా పిలుపునిచ్చారు. 11 ఏళ్ల మోదీ ప్రభుత్వ విజయవంత పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ , ప్రధాని మోదీకి అభినందనలు తెలియజేస్తూ , ఆపరేషన్ సింధూర్ ను విజయవంతంగా చేపట్టిన భారత త్రివిదదళాలకు, ప్రధాని మోదీ కి అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించారు. సమావేశానంతరం అనంతరం శ్రీ తపాలా లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం కళ్యాణమండప ప్రాంగణం వద్ద బిజెపి శ్రేణులు పలు మొక్కలు నాటారు.

# పాఠశాల గోడ కూలి ముగ్గురు విద్యార్థులకు గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

ఆదిలాబాద్, జూన్ 6:జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం గోడ కూలి ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. జిల్లాలోని కోవూరు మండలం అంతర్నీ గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంలో ముగ్గురు విద్యార్థులు ఆడుకుంటుండగా గోడకూలి ఇటుకలు మీదపడ్డాయి.

ఈ ఘటనలో ప్రేమ్(7), లక్ష్మణ్ చందా మండలం తిర్పెల్లి గ్రామానికి చెందిన సాయికుమార్ (6) తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో సాయికుమార్ పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. మరో విద్యార్థి అభినయ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని 108 అంబులెన్సులో భైంసా పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన పాఠశాలను కూల్చివేయాలని అధికారులు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపించారు.

# ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల కలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్

-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి



రాజన్న సిరిసిల్ల, జూన్ 6: (నేటినిజం ప్రతినిధి): నిరుపేదల దశాబ్దాల కలను ఇందిరమ్మ ఇంటితో కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని వేములవాడ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి అన్నారు. వేములవాడ పట్టణంలోని 8 వార్డులో ఎగమంటే శ్రీమతి, పాలకుర్తి పద్మ, సగ్గు లావణ్య, కాముని సంతోషిని, కాముని వీణ, నరాల మంజుల నరాల రేణుక, దూలం కనకలక్ష్మికి చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేయగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. అనంతరం కొబ్బరికాయ కొట్టి భూమి పూజను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో పట్టణంలోని ప్రతి వార్డులో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ప్రెసిడెంట్ కాపీలను అందజేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పేదలకు ఇందిరమ్మ ఇల్లు, యువకులకు రాజీవ్ యువ వికాసం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లాంటి సంక్షేమ పథకాలతో అభివృద్ధిలో దూసుకుపోతున్నామన్నారు. వారి వెంట నాయకుల జిల్లా ఉపాధ్యక్షులు నాగుల విష్ణు ప్రసాద్, వనపర్తి శంకర్, షేక్ ఇర్ఫాన్, నరాల దేవరాజు తో పాటు కనకలక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలి : ఎం.లక్ష్మి

నల్గొండ, జూన్ 6: ఎమ్మార్పీ ధరలకే డీలర్లు విత్తనాలు, ఎరువులు విక్రయించాలని టాస్క్‌ఫోర్స్ అధికారి ఎం.లక్ష్మి అన్నారు. లేనియెడల విత్తన యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. శుక్రవారం అనుముల మండలం హాలియాలోని పలు విత్తన దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు దుకాణాల్లో విత్తన స్టాక్, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, ఇన్‌వాయిస్, కంపెనీ సెక్యూర్ ఆఫ్ సప్లయ్ సర్టిఫికేట్, లైసెన్స్, స్టాక్‌బోర్డు, ధరల పట్టిక మొదలగు అంశాలను పరిశీలించారు. ఆయా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని విత్తన డీలర్లుకు ఆమె సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి సరిత ఉన్నారు.

# రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



ఆదిలాబాద్, జూన్ 6: కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి (కేవీకే) శాస్త్రవేత్తలుశుక్రవారం తాండూరు మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయంలో నూతన విధానాలు, ఎరువులు, రసాయనాలు, నీటి వినియోగాన్ని వివరించారు. భూసార పరిరక్షణ, పంట మార్పిడి, మార్కెటింగ్, వివిధ తోటల పెంపకం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ స్రవంతి, నగరాజు, బెల్లంపల్లి ఏడీఏ రాజనరేందర్ మాట్లాడుతూ ఎరువులను అధికంగా వాడితే భూసారం తగ్గి పంటల దిగుబడి తగ్గుతుం దని అన్నారు. వ్యవసాయ అధికారులు,శాస్త్రవేత్తల సలహాలను పాటిస్తే అధిక లాభాలు వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుష్మ, ఏఈవో శంకర్, నాయకులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ బహిరంగ సభ.. భూనిర్వాసితులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు




మెదక్, జూన్ 6:: సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో ఎక్కడ భూనిర్వాసితులు నిలదీస్తారోనని వారిని ముందస్తుగా అరెస్టు చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలం తిరుమలాపూర్‌లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరిగింది. ఈ నేపథ్యంలో నర్సన్నపేట రీజినల్ రింగ్ రోడ్డు బాధితులను మార్కుక్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సీఎం సభకు వెళ్లి ఏమైనా గొడవలు సృష్టిస్తారనే అనుమానంతోనే వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత బాధిత రైతులను పోలీసులు విడుదల చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు వెళ్లి తమకు పరిహారం ఎక్కువ ఇప్పించాలని అడుగుదామని అనుకున్నామని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి సభకు వెళ్లకుండా ముందస్తుగా అరెస్టు చేయడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

# పెర్కపల్లిలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన.. పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

కరీంనగర్, జూన్ 6:మండలంలోని పెర్కపల్లి గ్రామంలో గ్రామస్తులు పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు వొడితల సతీష్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలు ఎల్లా వేళల సంతోషంగా ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు ముత్యాల గాంధీ యాదవ్, సర్దార్, గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి కొమురయ్య, సర్వాయి పేట గ్రామ శాఖ అధ్యక్షుడు మలుగు సంపత్, మండల యూత్ నాయకులు మాదం స్వామి, మాదం రమేష్, మాదం మహేష్, పిల్లి వెంకటేష్, జంపయ్య, రవి, కుమార్, నరేష్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈప్యాక్ ప్రీఫ్యాబ్ ఆధ్వర్యంలో..మాంబట్టులో శాండ్‌విచ్ ప్యానల్ తయారీ ప్లాంట్ ప్రారంభం




హైదరాబాద్, జూన్ 6:పారిశ్రామిక మౌలిక సదుపాయాలలో అవసరమయ్యే 'శాండ్‌విచ్ ప్యానల్' తయారీ ప్లాంట్‌ను తడ దగ్గర మాంబట్టులో ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ సంజయ్ సింఘానియా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్, ఫుడ్ ప్రాసెసింగ్, క్లీన్‌రూమ్‌లు, పారిశ్రామిక మౌలిక సదుపాయాల రంగాలలో శాండ్‌విచ్ ప్యానల్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే లక్ష్యమన్నారు. ఎనర్జీ ఎఫిషియంట్, హై పెర్ఫార్మెన్స్ శాండ్‌విచ్ ప్యానల్స్ అవసరాలు తీర్చేందుకు ప్రత్యేకంగా రూపకల్పన చేశామన్నారు. ఈ కొత్త ప్లాంట్ 2,83,660 చదరపు అడుగులలో ఉందన్నారు. ఇందులో 1,49,151 చదరపు అడుగుల నిర్మిత ప్రాంతం కలదన్నారు. ఈ కొత్త ఫ్యాక్టరీ ద్వారా ఈప్యాక్ సంవత్సరానికి ఎనిమిది లక్షల చదరపు మీటర్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుందన్నారు. దీంతో సంస్థ మొత్తం శాండ్‌విచ్ ప్యానల్ ఉత్పత్తి సామర్థ్యం 13.10 లక్షల చదరపు మీటర్లకు చేరుకుందన్నారు. ఈ ప్లాంట్‌లో పూర్తిగా ఆటోమేటెడ్, కంటిన్యూయస్ ప్రొడక్షన్ లైన్ ఏర్పాటు చేశామన్నారు. ఇది పీయూఆర్/పీఐఆర్, రాక్‌వూల్ ప్యానల్స్‌ను తయారు చేయగలదన్నారు. ఈ ఆధునిక సాంకేతికత అధిక కచ్చితత్వాన్ని ఇస్తుందన్నారు. మనుషులు చేసే పని తక్కువగా ఉంటుందన్నారు. మెరుగైన నాణ్యతను ఇస్తుందని చెప్పారు. ముడి సరకుల వృథాను తగ్గిస్తుందన్నారు. ఈ ప్లాంట్ ప్రారంభం మా సంస్థ ప్రయాణంలో ఒక కీలక ఘట్టం అన్నారు. భారతదేశంలో వేగవంతమైన, పర్యావరణహిత నిర్మాణ పరిష్కారాలను అందించే దిశగా ఇది ఒక ముందడుగని తెలిపారు. దక్షిణాదిలో వ్యూహాత్మకంగా అనుకూలమైన ఈ ప్లాంట్ కోల్డ్‌చైన్, ఆహార ప్రాసెసింగ్, ఇండస్ట్రియల్ వేర్‌హౌసింగ్ తదితర కీలక రంగాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా మా ప్రాభావాన్ని పెంచుకుంటామన్నారు. ఆధునిక ప్రీఫ్యాబ్ టెక్నాలజీతో దేశ నిర్మాణంల భాగస్వామ్యం కావాలన్న మా ఆశయానికి ఇది నిదర్శనమన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్', 'పీఎం గతిశక్తి' వంటి జాతీయ మిషన్లకు అనుగుణంగా ముందుకు సాగడం మాకెంతో గర్వకారణం అన్నారు. ఈ ప్లాంట్ నిర్మాణానికి (భూమి వ్యయం మినహాయించి) రూ.56 కోట్లు పెట్టుబడి పెట్టామన్నారు. ఈ ప్లాంట్ ప్రారంభంతో వేగంగా, విస్తృతంగా, సమర్థవంతంగా వినియోగదారుల అవసరాలను తీర్చగల సామర్థ్యాన్ని పొందిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరకు ప్రీఫ్యాబ్ శాండ్‌విచ్ ప్యానల్ మార్కెట్‌లో 30 నుంచి 35 శాతం వాటాను సాధించడమే లక్ష్యమన్నారు. తమిళనాడు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి కాలుష్య నియంత్రణ చట్టాలు, పర్యావరణ పరిరక్షణ చట్టాలకు అనుగుణంగా ఆమోదం పొందిందన్నారు. ఈ ప్లాంట్‌లో ఉన్న ఆటోమేటెడ్ వ్యవస్థలు తక్కువ విద్యుత్ వినియోగంతో అధిక నాణ్యత గల ప్యానల్స్‌ను ఉత్పత్తి చేస్తాయని తెలిపారు.

# ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి: కొత్త ప్రభాకర్ రెడ్డి



మెదక్, జూన్ 6: ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని పెద్ద ఆరేపల్లి గ్రామంలో జరుగుతున్న బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి హాజరై గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాలు అధికంగా కురిసి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పెద్ద ఆరేపల్లి గ్రామంలో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని గ్రామస్తులు ఐక్యంగా ఉండి గత మూడు రోజుల నుంచి ఉత్సవాలు నిర్వహించుకోవడం పట్ల ఆయన అభినందించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు, పండుగలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసిన ఘనత దక్కిందన్నారు.

## పెద్దమ్మ ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి

దౌల్తాబాద్ మండలం మాచిన్ పల్లి గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్ పర్సన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆలయాలు నిర్మించుకొని ఆధ్యాత్మిక భావన వైపు వెళ్లడాన్ని ఆయన అభినందించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు గుర్తింపుగా గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకోవడం ఎంతో సంతోషం కలిగిస్తుందని వారు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత ఉంటుందని వారు సూచించారు.

# రైలులో మహిళ హ్యాండ్‌బ్యాగ్ చోరీ.. కాపాడే క్రమంలో చేయి కోల్పోయిన భర్త

ముంబై, జూన్ 6: డాక్టర్లైన దంపతులు రైలులో ప్రయాణించారు. మహిళ హ్యాండ్‌బ్యాగ్‌ను దొంగ లాక్కొన్నాడు. బ్యాగ్ పట్టుకున్న ఆమెను డోర్ వరకు లాక్కెళ్లాడు. అప్రమత్తమైన భర్త తన భార్యను కాపాడేందుకు ప్రయత్నించి చేతిని కోల్పోయాడు. మహారాష్ట్రలో ఈ సంఘటన జరిగింది. ముంబైకి చెందిన 50 ఏళ్ల యోగేష్ దేశ్‌ముఖ్, 44 ఏళ్ల భార్య దీపాలీ డాక్టర్లు. జూన్ 4న తమ తొమ్మిదేళ్ల కుమార్తెతో కలిసి లోక్‌మాన్య తిలక్ టెర్మినస్ (కుర్లా )-నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు.

కాగా, రైలు కుర్లా స్టేషన్ నుంచి బయలుదేరిన తర్వాత ఒక దొంగ దీపాలీ హ్యాండ్‌బ్యాగ్‌ను లాక్కొనేందుకు ప్రయత్నించాడు. ప్రతిఘటించిన ఆమె తన హ్యాండ్‌బ్యాగ్‌ను గట్టిగా పట్టుకున్నది. దీంతో దొంగ హ్యాండ్‌బ్యాగ్‌తోపాటు ఆ మహిళను ఆ కోచ్ డోర్ వరకు లాక్కెళ్లాడు.


మరోవైపు పై బెర్తుపై నిద్రిస్తున్న దీపాలి భర్త యోగేష్ అప్రమత్తమై ఆమెను రక్షించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పట్టుతప్పి భార్యాభర్తలిద్దరూ కదులుతున్న రైలు నుంచి పడిపోయారు. దీపాలి తీవ్రంగా గాయపడగా, భర్త యోగేష్ చేతి భాగం రైలు చక్రాల కింద నలిగిపోయింది. రైలు వేగం తగ్గడంతో దొంగ జంప్ చేసి హ్యాండ్‌బ్యాగ్‌తో పారిపోయాడు.

కాగా, రైలు పట్టాల వద్ద పడిన డాక్టర్ దంపతులు పోలీసుల సహాయం కోసం ప్రయత్నించారు. అయితే వారు ఉన్న ప్రాంతం ఏమిటో చెప్పలేకపోయారు. చివరకు ఒక మినీ లారీ డ్రైవర్ వీరిని గమనించాడు. వారు సహాయం కోరడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు.

మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు స్పందించారు. రైలులో ఉన్న డాక్టర్ దంపతుల 9 ఏళ్ల కుమార్తెను కల్యాణ్ స్టేషన్‌లో సురక్షితంగా దించారు. రైలులో హ్యాండ్‌బ్యాగ్ చోరీపై కేసు నమోదు చేశారు. నిందితుడ్ని గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.

# మహీంద్రా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా డీన్‌గా జయరాం రఘునాథ్

Mahindra™ University
Global Thinkers. Engaged Leaders.



హైదరాబాద్, జూన్ 6:మహీంద్రా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా డీన్‌గా డాక్టర్ జయరాం రఘునాథ్ నియమితులయ్యారు. ఆయన న్యాయ విద్యావేత్త, పరిశోధకుడు. ఈ రంగంలో ఇరవై ఐదు సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. ఆయన ఇంతకముందు జైపూర్లో ఉన్న జీడీ గోయంకా విశ్వవిద్యాలయం, మణిపాల్ విశ్వవిద్యాలయంలో డీన్‌గా పని చేశారు. న్యాయ విద్యలో ప్రొఫెషనల్ ప్రాక్టీస్‌ను సమగ్రంగా చేర్చే విషయంలో అనేక ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగా ఆయన ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్లు ఏపీసీఏఎం ద్వారా ఉత్తమ ఏడీఆర్ ఇన్నోవేషన్‌గా గుర్తింపు పొందాయి. విద్యార్థి కేంద్రీకృత, పరిశ్రమకు అనువైన పాఠ్యాంశాల రూపకల్పనలో ఆయనకు నైపుణ్యం కలదు. న్యాయ విద్యలో నూతనత్వానికి మార్గం సుగమం చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా న్యాయ విద్యను అభివృద్ధి చేయడంలో కృషి చేశారు. ఈ సందర్భంగా మహీంద్రా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ యజులు మెదురి మాట్లాడుతూ స్కూల్ ఆఫ్ లా డీన్‌గా డాక్టర్ జయరామ్ రఘునాథ్‌కు సాదర స్వాగతం పలుకుతున్నామన్నారు. ఆయన దార్శనికత, అకడమిక్ నైపుణ్యంపై ఉన్న నిబద్ధత మహీంద్రా విశ్వవిద్యాలయం న్యాయ విద్యను పునర్నిర్మించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఉన్నాయన్నారు. ప్రపంచం వేగంగా మారుతుందన్నారు. ఈ నేపథ్యంలో వివిధ సంక్లిష్టతలను అధిగమించగల భవిష్యత్తుకు సిద్ధమైన న్యాయ నిపుణులను అభివృద్ధి చేయాలన్న మా ప్రయత్నానికి డాక్టర్ రఘునాథ్ నాయకత్వం కీలకపాత్ర పోషించనుందని తెలిపారు. ఆయన మార్గదర్శకత్వంలో ప్రపంచ స్థాయి న్యాయ విద్యను అందించగలమన్న విశ్వాసం ఉందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జయరామ్ రఘునాథ్ మాట్లాడుతూ భారతదేశంలో న్యాయ విద్యకు ఇది ఒక మైలురాయి అన్నారు. మహీంద్రా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లాను గ్లోబల్ అవగాహనతో కొత్త దిశలో ముందుకు తీసుకెళ్లే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సాంకేతికత, అంతరశాఖల విద్యా విధానం, నైతికత, సామాజిక న్యాయం పట్ల స్పృహ పెరుగుతుందని తెలిపారు. వీటి మధ్య శక్తివంతమైన సమన్వయాన్ని చూస్తున్నామన్నారు. ఈ సమన్వయంతో విశ్వవిద్యాలయంలో విద్యా వాతావరణాన్ని తీర్చిదిద్దాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

# క్వార్టర్స్ సాత్విక్-చిరాగ్ ఓటమి.. ముగిసిన భారత పోరు !

న్యూఢిల్లీ, జూన్ 6:ఇండోనేషియా ఓపెన్ టోర్నమెంట్‌లో భారత పోరు నిరాశతో ముగిసింది. భారత్ స్టార్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ చిరాగ్ క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. మలేషియాకు చెందిన మాన్ వీ చాంగ్ టీ కై వున్ జోడీ చేతిలో 19-21, 16-21 తేడాతో పరాజయం పాలయ్యారు. ఈ విజయంతో మలేషియా జోడీ సెమీఫైనల్‌లోకి అడుగుపెట్టగా.. సాత్విక్-చిరాగ్ ఓటమితో భారత్ ఆశలు అంతమయ్యాయి. భారత ఆటగాళ్లు ఇప్పటికే సింగిల్స్, డబుల్స్ విభాగాల నుంచి ఎలిమినేట్ అవ్వగా సాత్విక్ చిరాగ్ ఓటమితో టోర్నమెంట్ లో భారత్ పోరు ముగిసింది.

# పట్టుబడిన డ్రగ్స్, గంజాయి పక్కదారి

హైదరాబాద్, జూన్ 6:ఆబ్కారీ శాఖలో మత్తు మాఫియా రాజ్యమేలుతోంది. ఆయా కేసుల్లో పట్టుబడిన డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలు దహన వాటికల నుంచి పక్కదారి పడుతున్నాయి. డ్రగ్స్, గంజాయి తదితర మాదక ద్రవ్యాల విక్రయాలు, వినియోగాన్ని అరికట్టాల్సిన ఆబ్కారీ శాఖలోని కొందరు సిబ్బందే, కంచె చేనును మేసిన చందంగా ధ్వంసం చేయాల్సిన మత్తు పదార్థాలను మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఇప్పటికే కొందరు అధికారులు, సిబ్బంది మత్తు మాఫియాలతో అంటకాగుతున్నారంటూ వస్తున్న ఆరోపణలకు, తాజాగా గంజాయి విక్రయం కేసులో తాండూరు ఎక్సైజ్ కానిస్టేబుల్ పట్టుపడడం మరింత ఆజ్యం పోస్తోంది. తాండూరు ఎక్సైజ్ కానిస్టేబుల్ గులాం సుల్తాన్ అహ్మద్ ఆబ్కారీ శాఖ లోని కొందరు అధికారులకు నమ్మిన బంటు. డ్రగ్స్, గంజాయి కేసులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాడనే ప్రచారం ఉంది. అయితే అధికారుల నమ్మకాన్ని, నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకున్న సుల్తాన్ అహ్మద్ గత కొంత కాలంగా పట్టుబడిన గంజాయిని తిరిగి విక్రయించడం మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఈనెల 4న షాద్‌నగర్ పోలీసుల తనిఖీల్లో సుల్తాన్ అహ్మద్ బంధువు అంజద్ పట్టుబడటంతో ఈ ఘటన బట్టబయలైంది. అయితే నిందితుడు గంజాయి మాత్రమే విక్రయిస్తున్నాడా లేక కొకైన్ వంటి ఖరీదైన డ్రగ్స్ కూడా విక్రయిస్తున్నాడా అనేది ప్రశ్నార్థకంగా మిగిలి ంది. దీనిపై ఎక్సైజ్ అధికారులు పెదవి విప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. డ్రగ్స్ నిర్మూలన కోసం ఆబ్కారీ శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌టీఎఫ్, డీటీఎఫ్ వంటి పలు రకాల ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. ప్రతి రోజు సంబంధిత అధికారులు ఏదో ఒక చోట డ్రగ్స్ లేదా గంజాయి కేసులు పట్టుకోవడం, నిందితులను అరెస్టు చేసి, మత్తు పదార్థాలను సీజ్ చేయడం చూస్తున్నాం. కానీ అదే సమయంలో పట్టుబడిన మత్తు పదార్థాలు కేసు దర్యాప్తు తరువాత దహన వాటికలకు వెళ్తున్నాయా లేక తిరిగి మార్కెట్లోకి వెళ్తున్నాయా అనేది ప్రశ్నార్థకంగా మారుతోంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.